మంచం పట్టిన మధురవాడ

- పెరుగుతున్న జ్వరం కేసులు
- వార్డుల్లో లోపిస్తున్న పారిశుధ్యం
- ప్రభుత్వాస్పత్రుల్లో పగటిపూటే వైద్యం
- రాత్రి వేళల్లో ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కు



మధురవాడ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు



మధురవాడ పీహెచ్‌సీలో వైద్యురాలి చాంబర్ వద్ద వేచి ఉన్న రోగులు

మధురవాడ: వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. మధురవాడ పరిసర ప్రాంతాలలో జ్వర బాధితులు బాగా పెరిగిపోతున్నారు. జ్వరంతో పాటు జలుబు, దగ్గు, కండరాలు పట్టేసి కదల్లేని పరిస్థితి ఉండటంతో బాగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆస్పత్రుల వద్ద క్యూ కడుతున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజారోగ్యానికి ప్రాముఖ్యతనివ్వడంతో ప్రతీ వెయ్యిమందికి ఒక ఏఎన్ఎం, సుమారు 15వేల మందికి ఒక యూపీహెచ్‌సీ ఏర్పాటు చేసి, సేవలు అందించేవారు. ఆస్పత్రుల్లో వైద్యులు, మందులు అన్నీ అందుబాటులో ఉండేవి. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. ఇక ఆస్పత్రుల్లో ఎపిడమిక్ సీజన్‌లో సాధారణం కంటే అధికంగా మందులు అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం ఎపిడమిక్ సన్నద్ధత ఉందా అంటే ప్రశ్నార్థకమే.

రెట్టింపు సంఖ్యలో రోగులు

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో సాధారణ రోజుల్లో కంటే రెట్టింపుసంఖ్యలో ఓపీ నమోదవుతోంది. మధురవాడ పీహెచ్‌సీలోనే కాదు.. మారికవలస ఆర్‌జీకే కాలనీ, గణేష్ నగర్‌లోని స్వతంత్రనగర్, వాంబేకాలనీ, మిథిలాపురి వుడా కాలనీ, కొమ్మాదిలోని బక్కన్నపాలెం, పీఎం పాలెంలలోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల(యూపీహెచ్‌సీ)లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

ఎక్కడి మురుగు అక్కడే..

ఇటీవల పీఎం పాలెం గాయత్రినగర్‌లో డయేరియా సోకింది. మురుగునీరు నివాసాల్లోకి వచ్చేసిన కారణంగా తన పిల్లలిద్దరూ వ్యాధులు బారిన పడ్డారని ఓ మహిళ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు ఇచ్చారు. అయినా వార్డుల్లో పారిశుధ్య పరిస్థితి ఏమాత్రం మారలేదు. ఎక్కడికక్కడే మురుగు నిల్వ ఉంటోంది. దీంతో ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు.

పగటి పూటే వైద్య సేవలు

జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లో 5 యూపీహెచ్‌సీలు, 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీలో మరో యూపీహెచ్‌సీ, మధురవాడ పీహెచ్‌సీ ఉన్నాయి. మధురవాడ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉన్నారు. అయినా పగటి పూట 4 గంటల వరకు మాత్రమే వైద్య సేవలు అందుతున్నాయి. దీంతో రాత్రి వేళల్లో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించక తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. సాయంత్రం వేళల్లోనూ ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

మధురవాడ పీహెచ్‌సీలో గత 20రోజుల్లో ఓపీ నమోదు ఇలా..

మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిత్యం రోగులతో కిటకిటలాడుతోంది. ప్రతిరోజూ 120కి తగ్గకుండా ఓపీ నమోదవుతోంది. ఆదివారం వంటి సెలవురోజుల్లోనూ, అధిక వర్షాలు పడిన ఆగస్టు 15,16,17 తేదీల్లో తప్ప మిగిలిన అన్నిరోజుల్లోనూ ఇదే పరిస్థితి. సెలవురోజుల్లో వైద్యులు ఉండరని తెలిసినా పదుల సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వస్తున్నారంటే జ్వరాల తీవ్రత ఎలా ఉందో అర్థమవుతోంది. ఇది ఒక్క మధురవాడ పీహెచ్‌సీలో పరిస్థితి మాత్రమే. చుట్టుపక్కల మరో 5 యూపీహెచ్‌సీలు, ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ ఓపీ నమోదు వందల్లోనే ఉంటోంది.

తేదీ	ఓపీ		
ఆగస్టు 1	128	ఆగస్టు 12	130
ఆగస్టు 2	150	ఆగస్టు 13	166
ఆగస్టు 3 (ఆదివారం)	38	ఆగస్టు 14	120
ఆగస్టు 4	149	ఆగస్టు 15	50
ఆగస్టు 5	154	ఆగస్టు 16	91
ఆగస్టు 6	120	ఆగస్టు 17 (ఆదివారం)	18
ఆగస్టు 10 (ఆదివారం)	33	ఆగస్టు 19	140
ఆగస్టు 11	150	ఆగస్టు 20 (మధ్యాహ్నం 2గంటల వరకు)	140



మధురవాడలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

జాగ్రత్తలు పాటించాలి

వాతావరణ మార్పుల కారణంగా జ్వర బాధితులు పెరుగుతున్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు సాయంత్రం వరకు అందుబాటులో ఉంటున్నారు. జ్వరం కేసులు ఎక్కువగా వస్తున్న ప్రాంతాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అప్రమత్తం చేస్తున్నాం. సీజనల్‌గా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, వంటి జ్వరాలపై మరింత అవగాహన పెంచుతున్నాం. వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిశుభ్రత చాలా అవసరం. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీటి నిల్వలు లేకుండా చూడాలి. కాచి చల్లార్చిన నీరు తాగడం, వేడి ఆహార పదార్థాలు తీసుకోవడం మంచిది.

– దీపిక, వైద్యాధికారి, మధురవాడ పీహెచ్‌సీ



ఓపీ కోసం క్యూ

క్లుప్తంగా

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది దరి కేౌ కాలనీలో 5 రోజుల నుంచి నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ముగిశాయి. ముందుగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 5వేల మందికి మహాన్నదానం నిర్వహించి, సాయంత్రం స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, పోతిన ప్రసాద్, కాలనీ ప్రెసిడెంట్ ఉండా రమణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు పందిరి రాట



ఉత్సవరాట వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొమ్మాది: వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు 8వ వార్డు సాగర్‌నగర్ దరి భువనేశ్వర్ కాలనీ జైగణేష్ యూత్ బోయ్స్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాట మహోత్సవం నిర్వహించారు. నవరాత్రులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

సంగివలసలో..

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంగివలసలో గణపతి ఉత్సవాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పందిరి రాట వేశారు. కార్యక్రమంలో అక్కరమాని మంగరాజు, గంగాధర్, నారాయణరావు, పీతల వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం వద్ద బోరుబావి ప్రారంభం



బోరుబావిని ప్రారంభిస్తున్న వెంకటరావు

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ నగరపాలెంలో వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు రామాలయం వద్ద బోరుబావిని బుధవారం ప్రారంభించారు. ఇటీవల ఆలయ నిర్మాణ సమయంలో బోరుబావి, మోటారు, ఎలక్ట్రికల్ ఉపకరణాలకు గాను ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక రూ.2 లక్షలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. కార్యక్రమంలో మరుపిల్ల చిన్నారావు, రాయన రమణ, పిల్లా సూరిబాబు, పిల్లా వెంకట సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

పనోరమ హిల్స్ వాసుల ధర్నా



ధర్నా చేస్తున్న ఫ్లాట్ల యజమానులు

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 ఎండాడ లా కాలేజీ రోడ్డులోని పనోరమ హిల్స్‌లో బిల్డర్ కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో సెలబ్రిటీ టవర్స్ వాసులు బుధవారం ధర్నా నిర్వహించారు. సెలబ్రిటీ టవర్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. ఉమామహేశ్వరరావు, కార్యదర్శి మోహనరావు మాట్లాడుతూ 14ఏళ్లుగా బిల్డర్‌కు ఎన్నిసార్లు చెప్పినా అగ్రిమెంట్ ప్రకారం సదుపాయాలు కల్పించలేదన్నారు. జీవీఎంసీ, వుడా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా బిల్డర్‌పై చర్యలు చేపట్టలేదన్నారు. తక్షణం చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

ప్రపంచస్థాయి పారా వాలీబాల్ పోటీలకు ఎంపిక

సీతంపేట: అమెరికాలో అక్టోబర్ 12 నుంచి 18 వరకు జరగనున్న అంతర్జాతీయ పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దివ్యాంగులైన అన్నం గణేష్, వేల్పుల విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బోడపాటి శివదత్ వివరాలు వెల్లడించారు. బెంగళూరులో ఇటీవల జరిగిన సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, ఈ ప్రపంచ స్థాయి పోటీలకు వారు అర్హత సాధించారని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా చిప్పాడ, పాత మూలకుద్దు, అమనాం, జీరుపేట, అన్నవరం, పెదనాగమయ్యపాలెం, చిన నాగమయ్యపాలెం, పాతపాలెం, జీరుపాలెం, ఆశిపాలెం, నమ్మివానిపాలెం, కంచేరుపాలెం తదితర ప్రాంతాల్లో గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆనందపురం పరిధిలో..

తగరపువలస: ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారి తెలిపారు. ఈ కారణంగా వేములవలస, లొడగలవానిపాలెం, ఆనందపురం, సత్యకల్యాణి అపార్ట్‌మెంట్, బంటుపల్లి కళ్లాలు, ఈగలవానిపాలెం, దుక్కవానిపాలెం, మెట్టమీదపాలెం, పాలవలస, గుడిలోవ, వెల్లంకి, పెద్దిపాలెం, పొడుగుపాలెం, కుసులవాడ, జగన్నాధపురం, వెంకటాపురం, చందక, గొట్టిపల్లి, తర్లువాడ, నగరపాలెం, పందలపాక, బాకూరుపాలెం, ఇచ్చాపురం, చిన్నయ్యపాలెం, రామునేనిపేట, రేగానిగూడెం, ముకుందపురం కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వంద మంది మహిళలకు చీరల పంపిణీ

తగరపువలస: వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గ్రంథాలయం వీధిలో వంద మంది పేద మహిళలకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డబ్బీరు ప్రశాంతి, శీరపు అప్పలరెడ్డి, చిల్ల భాస్కరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, అక్కరమాని మంగరాజు, చిప్పాడ వెంకటేష్, తెడ్లాపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో మాజీ మంత్రి రోజా



శ్రీవారి సన్నిధిలో మాజీ మంత్రి రోజా దంపతులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

కొమ్మాది: రుషికొండ శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మాజీ మంత్రి ఆర్కే రోజా దంపతులు బుధవారం సందర్శించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా శ్రీవారి పాదాలు వద్ద పూజలు నిర్వహించి, అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ సాగరానికి అభిముఖంగా ఎత్తయిన కొండపై శ్రీవారి ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉందన్నారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనుభూతి కలిగిందని అన్నారు. ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు వారికి ప్రసాదం అందజేశారు.

వినాయక నిమజ్జనాలకు ప్రత్యేక ఏర్పాట్లు



బీచ్‌లో నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ అప్పలరాజు

భీమునిపట్నం: భీమిలి సముద్రతీరంలో వినాయక విగ్రహాల నిమజ్జనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని నార్త్ ఏసీపీ అప్పలరాజు తెలిపారు. బుధవారం సాయంత్రం ఇక్కడి తీరాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. ప్రతీ సంవత్సరం ఇక్కడ పెద్ద ఎత్తున నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ సారి కూడా బ్యారికేడ్లు, లైటింగ్, గత ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అవసరమైన పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అప్పలరాజు తెలిపారు. మండపాల వద్ద డీజే స్పీకర్లు పెట్టడం, భారీ శబ్దాలతో పాటలు పెట్టడం పూర్తిగా నిషేధమని, అందరూ దీనిని కచ్చితంగా పాటించాలని సూచించారు. విగ్రహాలను ఊరేగింపుగా తీరం వద్దకు తీసుకువచ్చినప్పుడు కూడా ఎవరికీ ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ తిరుమలరావు, ఎస్ఐ హరీష్, జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, తహసీల్దారు రామారావు పాల్గొన్నారు.

వెంకటేశ్వరమెట్ట హైవేపై వాహనాల బీభత్సం

ప్రయాణికులకు తృటిలో తప్పిన ప్రమాదం



హైవేపై నిలిచిపోయిన ట్రాఫిక్



లారీ డివైడర్‌పైకి ఎక్కేయడంతో ధ్వంసమైన స్టాపర్, ట్రాఫిక్ పోలీస్ బోర్డులు

తగరపువలస: జాతీయ రహదారిపై వెంకటేశ్వరమెట్ట వద్ద బుధవారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి శ్రీకాకుళం జిల్లా పలాస వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికుల కోసం జాతీయ రహదారిపై నిలిపి ఉంది. వెనుక నుంచి వస్తున్న కారు డ్రైవర్ బస్సును దాటివెళ్లే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో ఆ వెనుక నుంచి వేగంగా వస్తున్న భారీ లారీ డ్రైవర్ ముందున్న వాహనాలను తప్పించబోయి ఢీకొట్టి, అదే వేగంలో డివైడర్ పైకి చేరుకుని తిరిగి జాతీయరహదారిపై దిగి 100 మీటర్లు ముందుకు వెళ్లి గోస్తనీనది వంతెన నిలిపాడు. ఆ సమయంలో డివైడర్‌పై వేచి ఉన్న ప్రయాణికులు తృటిలో తప్పించుకున్నారు. లారీ డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి వాహనాన్ని డివైడర్‌పైకి ఎక్కించడంతో కారు, బస్సులో ఉన్నవారు కూడా భారీ ప్రమాదాన్ని తప్పించుకోగలిగారు. సంఘటనా స్థలం బీభత్సంగా మారడంతో ఇరువైపులా వేచి ఉన్న ప్రయాణికులు ఆందోళన చెందారు. ఎవరికీ ఏ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే వాహనాలకు అంతరాయం కలిగింది. భీమిలి ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

తండ్రిని కుమారుడి చెంతకు చేర్చిన పోలీసులు



తండ్రిని కుమారుడికి అప్పగిస్తున్న సీపీ బాగ్చి

విశాఖ సిటీ: నగరంలో వర్షంలో తడుస్తూ దయనీయ స్థితిలో ఉన్న వృద్ధుడిని పోలీసులు గుర్తించి ఛత్తీస్‌గఢ్‌లో ఉంటున్న అతని కుమారుడికి అప్పగించారు. ఈ నెల 16న శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి నగరంలో పర్యటిస్తున్న సమయంలో సాగర్‌నగర్ బీచ్ రోడ్డులో వర్షంలో తడుస్తూ ఒక వృద్ధుడు కనిపించాడు. వెంటనే సీపీ ఆ వ్యక్తిని ఎస్కార్ట్ వాహనంలో అక్కడి నుంచి పెదవాల్తేరులో ఉన్న జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ షెల్టర్‌కు తరలించారు. సదరు వృద్ధుడిని జ్యోతిర్గమయ కార్యక్రమంలో భాగం చేసి, ఆశ్రయం కల్పించారు. అతని కుటుంబ సభ్యుల వివరాలపై ఆరా తీయాలని సీపీ సిబ్బందిని ఆదేశించారు. రెడ్‌క్రాస్ సిబ్బంది వృద్ధుడికి సపర్యలు చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన పేరు రామ్ బగాస్ (87) అని, ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ సమీపంలో సత్నమి గ్రామంలో నివాసముంటున్నట్లు చెప్పాడు. దీంతో బగాస్ కుమారుడు రతన్ రామ్ బగాస్‌కు రెడ్‌క్రాస్ సిబ్బంది సమాచారం అందించి విశాఖకు రప్పించి బుధవారం తండ్రిని అప్పగించారు. మతిస్థిమితం కోల్పోయి దూరమై నాలుగు నెలలవడంతో తండ్రిని తిరిగి కలుసుకుంటామని అనుకోలేదని, తన తండ్రిని గుర్తించి, తమకు అప్పగించిన సీపీ శంఖబ్రత బాగ్చికి ధన్యవాదాలు తెలిపారు.

సూదికొండ వద్ద రైతుల వంటావార్పు

- బలవంతపు భూసేకరణ అన్యాయమంటూ నిరసన
- గ్రామసభ ద్వారా రైతుల అభిప్రాయాలు తెలుసుకోవాలని డిమాండ్



సూదికొండ వద్ద రైతుల వంటవార్పును అడ్డుకునేందుకు వచ్చిన పోలీసులు



వంటావార్పు అనంతరం భోజనాలు చేస్తున్న రైతులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో సూదికొండ వద్ద సాగు భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణ పనులకు నిరసనగా రైతులు బుధవారం టెంట్ వేసి వంటా వార్పు చేపట్టారు. మధ్యాహ్న భోజనం చేశారు. వంటావార్పు కార్యక్రమాన్ని సందర్శించిన సీపీఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్న భూములను రైతుల నుంచి బలవంతంగా లాక్కోవడం అన్యాయమన్నారు. గ్రామసభ పెట్టకుండా, రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఎంఎస్ఎంఈ పార్కుకి ఈ భూములను ఎలా కేటాయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూముల్లో రైతులు వేసిన నీలగిరి, జీడిమామిడి, టేకు మొక్కలను జేసీబీలతో తొలగించి, రైతుల పొట్టకొట్టడం దారుణమన్నారు. భూసేకరణ చట్టం–2013 ప్రకారం భూమికి మార్కెట్ విలువ ప్రకారం రెండున్నర రెట్లు, మొక్కలకు నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు.

వెనక్కి తగ్గని రైతులు

టెంట్ తీసేయాలని లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు, రెవెన్యూ అధికారులు రైతులకు హెచ్చరికలు జారీ చేశారు. అయినా రైతులు ఏ మాత్రం తగ్గలేదు. గ్రామ సభ పెట్టి, అందులో తమ డిమాండ్లను ఆమోదిస్తేనే టెంటు ఎత్తేస్తామని.. లేదంటే నిరసన కొనసాగిస్తామని తెగేసి చెప్పారు. సోమవారం గ్రామ సభ పెడతామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు. రైతులు సూదికొండ వద్ద వంటవార్పు అనంతరం మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో గాడు అప్పలరాజు, సుంకర నారాయణరావు, బొలె అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

సమయపాలన లేని సచివాలయం



ఉదయం 11 గంటలకు కూడా తెరుచుకోని నగరపాలెం సచివాలయం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో సచివాలయాలు సమయానికి తెరుచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాస్తవానికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయం తెరచి, కార్యదర్శులు అందుబాటులో ఉండాలి. కానీ అలా జరగడం లేదని చెబుతున్నారు. బుధవారం ఉదయం 11గంటలు దాటినా కె. నగరపాలెం సచివాలయం తెరుచుకోలేదు. దీంతో ఇక్కడికి వచ్చిన పలువురు అసహనం వ్యక్తం చేశారు. తరువాత తెరుచుకున్నా కార్యదర్శులు అందుబాటులో ఉండటం లేదని, ప్రశ్నిస్తే సర్వేల కోసం బయటకు వెళ్తున్నామని చెబుతున్నారని అంటున్నారు. సంబంధిత అధికారులు సచివాలయాల నిర్వహణపై దృష్టి సారించి, కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమిత స్థలాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



నర్సింహానగర్‌లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు భీమిలి బీచ్ రోడ్డు కాపులుప్పాడ రెవెన్యూ కె.నగరపాలెం పరిధి నర్సింహనగర్‌లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఆర్డీవో సంగీత్ మాథూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు అందిన ఫిర్యాదు మేరకు 314 సర్వే నెంబరులో మూడు చోట్ల, 303లో ఒక చోట ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు ఆర్ఐ శ్రీదేవి ఆధ్వర్యంలో ఆక్రమిత స్థలాల్లో బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

మత్స్యకార మహిళలకు సముద్ర నాచు పెంపకంపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలో మత్స్యకార మహిళలకు సముద్ర నాచు పెంపకం, ఉపాధి అవకాశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ మత్స్యకార మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా ప్రభుత్వం సముద్ర నాచు పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని చెప్పారు. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద 60శాతం సబ్సిడీ సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు. మంగమారిపేట తీరం వద్ద సముద్ర నాచుకు అనుగుణంగా ఉందన్న సీఎంఎఫ్ఆర్ఐ సూచనల మేరకు మంగమారిపేట వద్ద కప్పఫైకస్ జాతికి చెందిన సముద్రపు నాచు రకాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్త డా. శేఖర్ మేఘరాజన్ తదితరులు పాల్గొన్నారు.

అనుకూలాంశాలతోనే ఉత్పత్తి నాణ్యత

మురళీనగర్:వస్తువుల రూపకల్పనలో (డిజైన్) అనుకూలాంశాలు కీలకమని ల్యాబ్‌కార్ప్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్ కొరిపాడు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా 'డిజైన్ ఫర్ మాన్యుఫాక్చరబిలిటీ అండ్ డిజైన్ ఫర్ అసెంబ్లీ' అంశంపై ఆయన ప్రసంగించారు. వస్తువుల రూపకల్పన దశలోనే సమస్యలను గుర్తించడం ద్వారా తక్కువ ఖర్చుతో, నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయవచ్చన్నారు. గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రేమ్ కుమార్ సింగ్ తదితరులు ప్రసంగించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ వ్యాన్ డ్రైవర్ సుమన్

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఆర్టీవో కార్యాలయం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బొలెరో వ్యాన్ డ్రైవర్ సుమన్(35)తో పాటు బంటుపల్లి కళ్లాల రోడ్డులో ఉన్న వివేకానంద జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు గాయపడిన వారిలో ఉన్నారు. స్థానికులు తెలియజేసిన వివరాలివీ.. గంభీరం వద్ద ప్రైవేట్ కన్వెన్షన్ హాల్లో కళాశాల యాజమాన్యం బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించింది. ఫంక్షన్ అనంతరం కళాశాల విద్యార్థులు ముగ్గురు ఒకే ద్విచక్రవాహనంపై ఆనందపురం వైపు వస్తూ, ఆర్టీవో కార్యాలయం సమీపంలో వ్యాన్ నిలిపి పక్కన నిలబడ్డ డ్రైవర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని ఆనందపురం పోలీసులు స్థానికుల సాయంతో చికిత్స కోసం తరలించారు. విద్యార్థులను కళాశాలలో కాకుండా వేరొకచోట ఫంక్షన్‌కు సురక్షితంగా బస్సుల్లో తరలించకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.